సాక్షి సిద్దిపేట

సోమవారం ၊ 6 ၊ మార్చి ၊ 2023



సేంద్రియ సాగుతో అధిక దిగుబడి
సేంద్రియ సాగు పంటలను ఆహారంగా తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని హత్నూర మండల వ్యవసాయ విస్తీర్ణాధికారి వరప్రతాప్ సూచిస్తున్నారు. 8లో..



పరిహారం కోసం ఆందోళన
పరిహారం కోసం ఓ రైతు కుటుంబంతో కలిసి ఆందోళనకు దిగాడు. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలో చోటు చేసుకుంది. 8లో..



గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
గిరిజనుల సంక్షేమమే లక్ష్యమని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించారు. 9లో..

న్యూస్‌రీల్

20న హుస్నాబాద్‌కు మంత్రి కేటీఆర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఈ నెల 20న హుస్నాబాద్‌లో పర్యటిస్తారని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని ఇండోర్ స్టేడియం, టీటీసీ భవన్, బస్తీ దవాఖానా ప్రారంభంతో పాటు లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇండ్లను పంపిణీ, టూరిజం ఆధ్వర్యంలో రూ.3.50 కోట్ల నిధులతో ఎల్లమ్మ చెరువు మినీ ట్యాంక్‌బండ్ సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. అనంతరం 1లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఎంపీపీలు లకావత్ మానస, కీర్తి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎడబొయిన రజని, వైస్ చైర్ పర్సన్ రజిత, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాష తదితరులు ఉన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



శిక్షణను పరిశీలిస్తున్న అధికారి సరోజ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా బీసీ ఆఫీసర్ సరోజ అన్నారు. ఈ నెల 5 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న అందమైన చేతిరాత అభ్యాసంలో భాగంగా ఆదివారం పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సరోజ మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 18 ప్రీ మెట్రిక్ వసతి గృహాల్లో 1,452 మంది విద్యార్థులకు చేతిరాతలో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఆమెతో చేతి రాత నిపుణులు హెజస్ అమ్మద్, వార్డెన్ తదితరులు ఉన్నారు.

8న మహిళా సదస్సు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): టీపీటీఎఫ్ జిల్లా కమిటీ, మహిళా సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 8న సిద్దిపేటలో మహిళా సదస్సు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు విజయేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఉపాధ్యాయ భవన్‌లో మహిళా సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. సదస్సుకు జెడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, సామాజిక కార్యకర్త కే.సజయ పాల్గొంటారని తెలిఆపరు. మహిళా ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు వజ్రమ్మ, గంగా భవాని, సుశీల, వనిత, సుకన్య, సంతోషి, తిరుపతిరెడ్డి, రాములు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

అక్కన్నపేట(హుస్నాబాద్): ఈ నెల 24, 25 తేదీల్లో హుస్నాబాద్‌లో జరగనున్న గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి గన్నెబోయిన వెంకటాద్రి కోరారు. భూస్వామ్య విధానం రద్దు చేసి, దున్నేవారికే భూమి లక్ష్యంతో గ్రామీణ పేదల సంఘం పోరాడుతుందన్నారు. సమావేశానికి అన్ని గ్రామల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో డీఎస్ఓ జిల్లా కార్యదర్శి భానోతు తిరుపతినాయక్, ఓపీడీఆర్ జిల్లా కార్యదర్శి గాజుల జయరాములు తదితరులు ఉన్నారు.

'భృతి కల్పనలో ప్రభుత్వం విఫలం'

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నిరుద్యోగులకు భృతి కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని రెవల్యూషనరీ యూత్ ఫ్రంట్ (ఆర్‌వైఎఫ్) జిల్లా అధ్యక్షుడు రమేశ్ అన్నారు. ఆర్‌వైఎఫ్ 33వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిద్దిపేటలోని కార్యాలయంలో స్వీట్లు పంచుకుని వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారన్నారు. బీఆర్ఎస్ పాలనలో యువతకు ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలన్నారు.

ప్రతికూలంలోనూ అనుకూలం

రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు
- మార్కెటింగ్ శాఖకు భారీగా ఆదాయం
- ఫిబ్రవరి చివరికి రూ.24.69కోట్లు
- మార్చి నాటికి రూ.40కోట్లకు చేరుకునే అవకాశం



గజ్వేల్‌లో ధాన్యం కొనుగోళ్లు (ఫైల్)

గజ్వేల్: ప్రతికూల పరిస్థితుల్లోనూ అనుకూల ఫలితాలు వచ్చాయి. జిల్లాలోని మార్కెట్ కమిటీలకు 2022–23 ఆర్థిక సంవత్సరానికిగానూ మార్కెట్ ఫీజు రూపంలో ఫిబ్రవరి చివరినాటికి రూ.24.69కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ఏడాది రూ.32.30కోట్ల లక్ష్యం ఉండగా, అంతకు మించి ఆదాయం వచ్చే అవకాశం ఉంది. మార్చి నెలాఖరు నాటికి అన్నీ కలుపుకొని రూ.40కోట్లకుపైగా చేరుకునే అవకాశం ఉందని అధికారుల అంచనా. గతేడాది రూ.26.95కోట్ల లక్ష్యం ఉండగా, అతివృష్టి కారణంగా రూ.25కోట్లు మాత్రమే ఆదాయం సమకూరింది. ఎక్కడికక్కడ పంటలు దెబ్బతినడంతో మార్కెటింగ్ శాఖకు ఆదాయం గణనీయంగా పడిపోతుందని భావించారు. కానీ వరి ఉత్పత్తులు భారీగా పెరగడంతో కాలం కలిసి రావడంతో లాభాల బాట పట్టనుంది.

జిల్లా వ్యాప్తంగా..
జిల్లాలో గజ్వేల్, సిద్దిపేట, చిన్నకోదూర్, నంగునూర్, తొగుట, దౌల్తాబాద్, కొండపాక, మిర్‌దొడ్డి, దుబ్బాక, బెజ్జంకి, హుస్నాబాద్, కొహెడ, చేర్యాల, వంటిమామిడిలో మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వరి, పత్తి, మొక్కజొన్న, కందులు, శనగ, పెసర్లు, వేరుశనగ, కూరగాయలు తదితర ఉత్పత్తుల ద్వారా ఫీజు రూపంలో మార్కెట్‌ఉ ఆదాయం సమకూరుతుంది. ప్రభుత్వ సంస్థలు, వ్యాపారుల క్రయవిక్రయాల్లో 2శాతం మార్కెట్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ సంస్థ నాఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసే మక్కలు, కందులు, శనగలు, పెసర్లు వేరుశనగ తదితర ఉత్పత్తులకు మార్కెట్ ఫీజును వసూలును నిషేధించారు. దీంతో మార్కెట్ కమిటీలకు వరి, పత్తి ఉత్పత్తుల విక్రయాలపై వచ్చే మార్కెట్ ఫీజు, చెక్‌పోస్టులు, మడిగెల అద్దెలు, ఇతర వనరులతో పాటు ప్రైవేటులో మక్కలు, కందులు, శనగలు, పెసర్లు తదితరాల కొనుగోళ్ల ద్వారా మాత్రమే ఆదాయం సమకూరుతుంది.

వరి ఉత్పత్తులతోనే..
అతివృష్టి కారణంగా ఈ సారి అన్ని రకాల పంటల దిగుబడులు గణనీయంగా పడిపోయినా, రి పంట కలిసి వచ్చింది. ఫలితంగా జిల్లాలోని లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. జిల్లాలోని మార్కెట్ కమిటీలకు వరి ద్వారానే సింహభాగం ఆదాయం సమకూరగా, పత్తి, ఇతర వనరుల ద్వారా మిగిలిన ఆదాయం వచ్చింది. వరి ద్వారా మార్కెట్ ఫీజు కింద మరో రూ.15కోట్ల అదనపు ఆదాయం వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది రూ.32.30కోట్ల లక్ష్యం ఉండగా, ఫిబ్రవరి చివరికి నాటికే రూ.24.69కోట్లకు చేరుకుంది. మరో నెల రోజుల సమయం ఉండడంతో లక్ష్యం దాటి ఆదాయం రానుందని అంచనా. మార్కెట్ కమిటీలు అనుకున్న లక్ష్యాన్ని కంటే రూ.8కోట్ల పైచిలుకు ఆదాయం పెరగటం మార్కెటింగ్ శాఖలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

పత్తి.. అంతంతే..
అతివృష్టి కారణంగా తెల్లబంగారంగా పిలిచే పత్తి దిగుబడి పూర్తిగా పడిపోయింది. వచ్చిన కొద్దిపాటి పంట అమ్మకాలు మందకొడిగా సాగటంతో ఇప్పటివరకు మార్కెట్ ఫీజు కింద రూ.కోటి లోపు ఆదాయం సమకూరింది. గతంతో పోలిస్తే ఇది చాలా తక్కువ ఆదాయమని చెప్పొచ్చు.

లక్ష్యానికి మించి ఆదాయం

జిల్లా వ్యాప్తంగా పత్తి విషయంలో అంచనాలు తారుమారైనా, వరి ఉత్పత్తుల ద్వారా ఈసారి లక్ష్యానికి మించి ఆదాయం సమకూరింది. మార్చి నెలాఖరుకు వరకు రూ.40కోట్లకుపైగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది. భారీ ఆదాయం రావడం శుభపరిణామం.

– రియాజ్, జిల్లా మార్కెటింగ్ అధికారి



దయాలసిస్ సెంటర్‌లో కిడ్నీ రోగిని పరామర్శిస్తున్న మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే రఘునందన్‌రావు

డయాలసిస్ పేషెంట్లకు పెన్షన్

ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

దుబ్బాకటౌన్: రాష్ట్రంలో డయాలసిస్ రోగులకు త్వరలో ఆసరా పెన్షన్లు, ఉచిత బస్‌పాస్‌లను అందిస్తామని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఆదివారం దుబ్బాక వంద పడకల ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్‌ను ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్‌రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. డయాలసిస్ సెంటర్‌తో కిడ్నీ సంబంధ రోగులకు మెరుగైన సేవలు అందుతాయని అన్నారు. రానున్న రోజుల్లో బ్లడ్ స్టోరేజీని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాతో పేదలకు వైద్యసేవలు చేరువవుతాయని పేర్కొన్నారు. త్వరలో వెజ్, నాన్ వెజ్‌తో కూడిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని తెలిపారు. అనంతరం చేర్వాపూర్ మారెమ్మ –దుంపలపల్లి బైపాస్ రోడ్డు పనులు, రామసముద్రం కట్ట వద్ద సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ఫారూఖ్ హుస్సెన్, యాదవరెడ్డి, డీఎంహెచ్ఓ కాశీనాథ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్‌రెడ్డి, జెడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ హేమరాజ్‌సింగ్, కౌన్సిలర్లు ఉన్నారు.

ప్రజల సంక్షేమమే లక్ష్యం



బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే రసమయి

సిద్దిపేటరూరల్: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తుందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని చిన్నగుండవెళ్లి, రావురూకుల, రాఘవాపూర్, బుస్సాపూర్ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం,శంకుస్థాపన కార్యక్రమాల్లో మంత్రిహరీశ్‌రావు పాల్గొన్నారు. చిన్నగుండవెళ్లి గ్రామంలో రైతువేదిక, యోగాసెంటర్, రావురూకుల గ్రామంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి పంచాయతీ కార్యాలయం, రాఘవాపూర్ ఇంద్రగూడెం నుండి అప్పనపల్లి వరకు రూ.3.33 కోట్ల నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన, బుస్సాపూర్ గ్రామంలో ఎస్సీ హాల్ ప్రారంభం, రెడ్డి సంక్షేమ భవన్ శంకుస్థాపన, మహిళా భవనం, లైబ్రరీ,రూ.16లక్షలతో 10వేల మెట్రిక్ టన్నుల కోల్డ్‌స్టోరేజిని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆలోచనలతో రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. రూ.160 కోట్లతో చేపట్టనున్న రింగ్‌రోడ్డు నిర్మాణానికి ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని, ఇండ్లు కోల్పోయిన వారికి రూ.3లక్షల గ్రాంట్ అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ శ్రీహరిగౌడ్, వైస్ ఎంపీపీ యాదయ్య, సర్పంచ్‌లు రఘోత్తంరెడ్డి, కవిత, రమేశ్, సదాశివారెడ్డి, ఉపసర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

అర్బన్ పార్క్‌ను అందుబాటులోకి తేవాలి

కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



పార్కులో కాటేజీలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

గజ్వేల్: గజ్వేల్ అర్బన్ పార్క్ పనులు త్వరగా పూర్తి చేసి సందర్శకులకు అందుబాటులోకి తేవాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. అటవీ శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్‌తో కలిసి అర్బన్ పార్కును సందర్శించారు. పార్కులో కాటేజీలకు మరమ్మతు పనులను మే నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. కాటేజీల్లో ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, అర్బన్ పార్కు వివరాలతో కూడిన బోర్డులను రాజీవ్ రహదారిపై ఏర్పాటు చేసి, ఆన్‌లైన్‌లోనూ ప్రచారం కల్పించాలన్నారు. మార్నింగ్, ఈవినింగ్ వాకర్ల కోసం వసతులు ఉండేలా చూడాలన్నారు. కొండపాక మండలం లకుడారం వద్ద మల్లన్నవనం నుంచి మల్లన్నసాగర్ వ్యూ పాయింట్ వరకు వేస్తున్న రోడ్డు పనులను రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో గజ్వేల్ అటవీ శాఖ రేంజి అధికారి కిరణ్‌కుమార్, సెక్షన్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న నారాయణ

సిద్దిపేటకమాన్: ఉగాది విశిష్ట ప్రతిభా రత్న–2023 పురస్కార ఎంపికకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు నారాయణ తెలిపారు. ఆదివారం సిద్దిపేటలో మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి ఈ నెల 26న ఉగాది పండగ రోజు పురస్కారం అందించనున్నట్లు తెలిపారు. సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, వృద్ధుల, వికలాంగుల, విద్యా, వైద్యం, సాహిత్యం, సంగీతం, నృత్యం, కళలు, క్రీడలు, ఆధ్యాత్మికం, వ్యవసాయం, ఉపాధి కల్పన, నాటకరంగం, టీవీ, సినీరంగాల్లో సేవలందిస్తున్నవారు ఈ నెల 15 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఆల్ దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్ నంబర్ 1–20–164, గోకుల్‌నగర్, వెంకటాపురం, పోస్టు తిరుమలగిరి, సికింద్రాబాద్‌కు పంపించాలని కోరారు.

కొమురవెల్లిలో భక్తుల రద్దీ



రాజగోపురం ఎదుట భక్తుల కోలాహలం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో ఆదివారం ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసాయి. స్వామి వారి దర్శనానికి వరంగల్, మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలతో పాటు హైదరాబాద్ నుంచి సుమారు 40 వేల మంది భక్తులు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. శనివారం సాయత్రం నుంచే క్షేత్రానికి చేరుకున్న భక్తులు వేకువజాము నుంచే పుష్కరిణిలో స్నానాలు ఆచరించి, స్వామివారి దర్శనం చేసుకున్నారు. భక్తులు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు, పట్నాలు వేసి, ఒడి బియ్యంతో, గంగిరేణి చెట్టువద్ద పట్నాలు వేసి, ముడుపులు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. మట్టికుండలో బోనం తయారు చేసి కొండపై రేణుక ఎల్లమ్మ తల్లికి సమర్పించారు. కొంత మంది భక్తులు రాతి గీరల వద్ద ప్రదక్షిణలు, కోడెల స్తంభం వద్ద పూజలు చేశారు. బోనాలు డప్పు చప్పుళ్లతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. స్వామి దర్శనానికి 4 గంటల సమయం పట్టింది. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, ఆలయ ఈఓ బాలాజీ ఏఈఓ అంజయ్య, సూపరింటెండెంట్ నీల శేఖర్, ఆలయ ఉద్యోగులు నర్సింహులు, అంజయ్య పర్యవేక్షించారు.

మల్లన్నకు మెట్‌పల్లి ఎమ్మెల్యే పూజలు
కొమురవెల్లి మల్లికార్జున స్వామిని ఆదివారం కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ కుటుంబ సమేతగా దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న భక్తులు

మెదక్‌జోన్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో బిషప్‌గా కొనసాగిన కనకప్రసాద్ ఆదివారం పదవీ విరమణ పొందారు. ఈసందర్భంగా దూర ప్రాంతాల నుంచి వచ్చి న భక్తులనుద్దేశించి ఆఖరు దైవసందేశం ఇచ్చారు. అనంతరం ఆయనను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

అమరవీరుల స్మారకస్తూపం ఆవిష్కరణ

మిరుదొడ్డి(దుబ్బాక): మిషన్ భగీరథను హర్ ఘర్ కో జల్ అని, రైతు బంధును పీఎం కిసాన్ సమ్మాన్ నిధి అని, మిషన్ కాకతీయను అమృత్ సరోవర్ అంటూ కేంద్ర ప్రభుత్వం కాపీ కొడుతుందని ఆర్థిక, వైద్యారోగ్య మంత్రి హరీశ్‌రావు అన్నారు. మండలంలోని కొండాపూర్‌లో ఏర్పాటు చేసిన అమరుల స్మారక స్తూపాన్ని సీఎం ఓఎస్‌డీ దేశపతి శ్రీనివాస్, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఫారూఖ్ హుస్సేన్, యాదవరెడ్డితో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మంత్రికి మంగళహారతులతో స్వాగతం పలికారు. అనతంతరం ఆయన మాట్లాడుతూ.. అమరుల త్యాగాలు శాశ్వతంగా గుర్తుండి పోయేలా హైదరాబాద్‌లో ట్యాంక్ బండ్ వద్ద జూన్ 2న అమరుల స్తూపాన్ని ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. కొండాపూర్ అభివృద్ధికి రూ. 25 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జెల సాయిలు, డీసీసీబీ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ బక్కి వెంకటయ్య, మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ, టీపీటీఎస్ రాష్ట్ర నాయకుడు తిరుపతి రెడ్డి, సర్పంచ్ పెద్ది కవిత, ఉప సర్పంచ్ జీగిరి అమర్, నాయకులు సూకూరి లింగం, పెద్దిరాజు, రాజ మహేందర్‌రెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

ఊరిని వీడుతున్నారు

- ఇళ్లను ఖాళీ చేస్తున్న గుడాటిపల్లి నిర్వాసితులు
- ఇప్పటికే 500లకు పైగా ఇళ్ల కూల్చివేత
- ట్రాక్టర్లలో సామగ్రి తరలింపు



ఇల్లు ఖాళీ చేసి సామగ్రిని ట్రాక్టర్‌లో తరలిస్తున్న గుడాటిపల్లి నిర్వాసిత కుటుంబం

అక్కన్నపేట(హుస్నాబాద్): గౌరవెల్లి ప్రాజెక్టు ముంపు నిర్వాసితులు ఒక్కొక్కరుగా ఊరిని వీడుతున్నారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందడంతో ఇంత కాలం పుట్టి పెరిగిన సొంత ఊరిని, ఉన్న ఇంటిని ఖాళీ చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందడంతో స్వచ్ఛందంగా ఇళ్లను ఖాళీ చేసి వేరే చోటుకు తరలుతున్నారు. ప్రాజెక్టు పనులు చివరి దశకు చేరడంతో ముంపు గ్రామాన్ని ఖాళీ చేయించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. 742ఇళ్లకు గాను సుమారు 500పైగా ఇళ్లను నిర్వాసితులే స్వచ్ఛందంగా తొలగించారు. మరికొద్ది రోజుల్లో ఊరంతా ఖాళీ అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

స్వచ్ఛందంగా ఇళ్ల తొలగింపు..
అక్కన్నపేట మండలం గుడాటిపల్లి గ్రామం వద్ద 8.23 సామర్థ్యంతో నిర్మిస్తున్న నిర్మిస్తున్న గౌరవెల్లి ప్రాజెక్టుతో గుడాటిపల్లి గ్రామ పరిధిలోని కొత్తపల్లి, సోమాజితండా, సేవ్యనాయక్‌తండా, జాలుబాయి తండా, చింతల్‌తండా, తిరుమల్‌తండా, బోంద్యానాయక్‌తండా, తెనుగుపల్లి, మద్దెలపల్లి ముంపునకు గురవుతున్నాయి. ఇప్పటికే చాలావరకు ఇళ్లను అధికారులు తొలగించగా, మరో 120 ఇళ్ల కూలిచ్చవేత మిగిలి ఉందని తెలిపారు. ఇళ్ల కూల్చివేతకు రూ.30వేలు, రవాణాకు రూ.37వేలు ప్రభుత్వం అందిస్తుండడంతో భూ నిర్వాసితులు ఇంటి సామగ్రిని ట్రాక్టర్ల ద్వారా ఇతర చోట్లకు తరలించుకుంటున్నారు. రోజు పదుల సంఖ్యలో నిర్వాసితులే ఇళ్లను ఖాళీలు చేస్తున్నారు.

మే నెలలో ప్రారంభానికి ఏర్పాట్లు
హుస్నాబాద్ ప్రాంత ప్రజల దశాబ్దాల కల నెరవేరనుందిది. ఇక్కడి మెట్టప్రాంత వరప్రదాయని అయిన గౌరవెల్లి ప్రాజెక్టు పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఇప్పటికే ట్రయల్ రన్ విజయవంతమైంది. గ్రామానికి వెళ్లే రోడ్డు, కట్ట నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మే నెలలో సీఎం చేతుల మీదుగా ప్రాజెక్టును ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.



గౌరవెల్లి ప్రాజెక్టు



ఇల్లు ఖాళీ చేస్తున్న సోమాజితండా నిర్వాసితులు

క్లుప్తంగా

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

సంగారెడ్డి టౌన్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన సంగారెడ్డి పట్టణంలో చోటుచేసుకుంది. ఆదివారం సంగారెడ్డి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయం రెండో గేటు వద్ద గుర్తు తెలియని వృద్ధుడు (60) ఒంటిపై దుస్తులు లేకుండా పడిపోయి ఉన్నాడు. ఆకలి, వడదెబ్బతో మరణించినట్లు గుర్తించారు. మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి మార్చరీలో భద్రపరిచామని, ఎవరైనా ఆచూకీ తెలిసినవారు 87126 56746, 87126 56719 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

తులసీమాత సినిమా షూటింగ్



చాముండేశ్వరీ ఆలయ ఆవరణలో సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్ శివారులోగల చాముండేశ్వరీ ఆలయ ఆవరణలో జయహో తులసీమాత సినిమా షూటింగ్ జరుగుతోంది. చండూర్ శివారులోని ఓ ఫామ్ హౌస్‌లో సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. కొన్ని సన్నివేశాలను ఆదివారం చాముండేశ్వరీ ఆలయ ఆవరణలో చిత్రీకరించారు. ఈ చిత్రాన్ని అశుతోష్ నిర్మిస్తున్నారు. హీరోగా ఆయుష్, హీరోయిన్‌గా ప్రీతి నటిస్తున్నారన్నారు. చిత్రం షూటింగ్ త్వరలో పూర్తి చేస్తామని నిర్మాత అశుతోష్ తెలిపారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముందస్తు వేడుకలు

మెదక్ మున్సిపాలిటీ: పట్టణ ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముందుస్తు వేడుకలు పట్టణంలోని జీకేఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలు శారద, ప్రధాన కార్యదర్శి సుష్మ, కోశాధికారి సుజాత, మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీను, జిల్లా ఆర్యవైశ్య సంఘం మహిళా విభాగ అధ్యక్షురాలు వనజ, మెదక్ పట్టణ ఆర్యవైశ్య సంఘం మహిళా విభాగ్ అధ్యక్షురాలు పద్మ, వైశ్య సంఘం అధ్యక్షుడు శ్యామ్‌రావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అశోక్, ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ వెంకట్ నారాయణ, ఏడుపాయల దేవాలయ కమిటీ సభ్యుడు చక్రపాణి, మెదక్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శంకర్, మహిళలు పాల్గొన్నారు. అనంతరం మహిళలను సన్మానించారు.



మహిళలను సన్మానిస్తున్న దృశ్యం

సేంద్రియ సాగుతో రెట్టింపు మేలు

- రసాయన ఎరువుల వినియోగంతో అనర్థం
- సారం కోల్పోతున్న భూములు
- వర్మీ కంపోస్ట్ వినియోగంతో తెగుళ్లకు అడ్డుకట్ట



వర్మీ కంపోస్ట్ తయారీలో వానపాములు



వర ప్రతాప్, మండల వ్యవసాయ విస్తరణ అధికారి

హత్నూర(సంగారెడ్డి): సేంద్రియ సాగు చేసి పండించిన ఉత్పత్తులు ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా మేలు చేస్తాయి. రసాయన ఎరువులతో పండించినవి తీసుకుంటే అనారోగ్యానికి గురి కాక తప్పదని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. నీరు తర్వాత ఆహారం మనిషికి అత్యంత ప్రదానం. తీసుకునే ఆహారంలో పోషకాలు ఉంటేనే ఆరోగ్యంగా ఉంటాం. సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన వాని ఆహారంగా తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని హత్నూర మండల వ్యవసాయ విస్తీర్ణాధికారివర ప్రతాప్ అన్నారు.

- సేంద్రియ వ్యవసాయంలో వర్మీ కంపోస్ట్ లేదా వాన పాముల ఎరువు వాడితే రసాయన ఎరువులు వాడనసరం లేదు. + రైతుకు ఖర్చు తగ్గడంతో పాటు రసాయన రహిత పంటలు పండించవచ్చు. వర్మీ కంపోస్ట్ తయారీ విధానాల వివరాలు

వాన పాములు అనుకూలం

భూమి పొరల్లో వుంటూ బొరియలు చేయని వాన పాములు వర్మీ కంపోస్ట్ తయారు చేయడానికి అనుకూలం. మన వాతావరణానికి ఐసీనియా ఫోయిటీడ, పెరియనిక్స్ ఎక్సవేటస్ అనే రెండు రకాల వానపాములు అనువైనవి. ఇవి ఎక్కువ వ్యర్థ పదార్థాలను తింటు తక్కువ కాలంలో కంపోస్ట్‌ను తయారు చేస్తాయి.

వ్యర్థ పదార్థాలు

మనం పంటలు పండించిన తర్వాత మిగిలిన వ్యర్థ పదార్థాలు గడ్డి, ఆకులు, చెత్త, పశువుల పేడ, పండ్ల తొక్కలు, కూరగాయల వ్యర్థాలు ఇలా సహజంగా దొరికే వ్యవసాయ వ్యర్థాలు అవసరం.

ఇతర అవసరాలు

వాన పాములు సూటిగా ఎండను తట్టుకోలేవు. కాబట్టి వీటి రక్షణకు నీడను ఏర్పాటు చేసుకోవాలి. దీనికి షెడ్డు లేదా గుడిసెలు తయారు చేసుకోవాలి. ఇలా తయారు చేసుకోవడం వల్ల వాన పాములకు నీడను ఇవ్వడమే కాకుండా, ఎరువు నుంచి తేమ తొందరగా ఆవిరై పోకుండా కాపాడుకోవచ్చు. ఈ షెడ్డు నీడలో వర్మీ బెడ్స్ వేసుకోవాలి.

వర్మీ కంపోస్టు బెడ్స్ తయారీ విధానం

- మూడు అడుగుల వెడల్పుతో తూర్పు పడమర దిశలో మనకు కావాలిసినంత పొడవులో బెడ్లను ఏర్పాటు చేసుకోవాలి. వర్మి బెడ్ల అడుగు భాగం గట్టిగా వుండేట్టు చూసుకోవాలి.
- సిమెంట్ లేదా పేడతో గట్టి పరుచుకోవాలి. వర్మీ బెడ్ ఎత్తు సుమారు నేల నుండి 3 అడుగులు లేదా 100 సెం.మీ వుండేట్టు చూసుకోవాలి.
- పాలిథిన్ షీట్స్ తో తయారు చేసిన వర్మి కంపోస్ట్ బెడ్స్ కూడా మర్కెట్లో దొరుకుతున్నవి.
- 55 నుండి 60 రోజుల్లో పూర్తి వర్మి కంపోస్ట్ తయారవుతుంది. వర్మీ కంపోస్టు ఎరువు గోధుమ రంగులో వాసన లేకుండా టీ పొడి లాగా కనిపిస్తుంది.
- 2,3 మి.మీ జల్లెడతో జల్లించి సంచుల్లో నింపి నీడలో నిల్వవుంచుకోవాలి. ఈ వర్మీ కంపోస్ట్ కు సూడోమోనస్, ట్రికోడెర్మ విరిడీ లాంటి జీవ సంబంధిత పొడర్లను కలిపితే, వర్మీ కంపోస్ట్ లోని పోషక విలువలు పెరగడంతో పాటు, పంటలు ఎలాంటి రోగాల బారిన పడవు.
- బెడ్స్ అడుగు భాగంలో ఉన్న వాన పాములను ఎరువు నుంచి వేరు చేసి తిరిగి వర్మీ కంపోస్ట్ తయారీకి వాడుకోవచ్చు. ఇలా సంవత్సరానికి 5 నుండి 6 సార్లు వర్మి కంపోస్ట్ తయారు చేసుకోవచ్చు.

మోతాదు

- వర్మీ కంపోస్ట్ ను ఎకరాకు 8 నుండి 12 కిలోల వరకు వివిధ పంటలకు వేసుకోవచ్చు. పండ్ల తోటల్లో అయితే ప్రతీ చెట్టుకి 5 నుండి 10 కిలోల వరకు వేసుకోవచ్చు.
- ఏడాదికి ఒకటి లేదా రెండు సార్లు వేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు.

ఉపయోగాలు

- నేల గుల్ల బారడం
- నీటిని పట్టి ఉంచే సామర్థ్యం పెరగడం.
- నత్రజని, భాస్వరం ఎరువులతో పాటు 14 రకాల సూక్ష్మ పోషకాలు పంటలకు అందుతాయి.
- వేరే రసాయన ఎరువులు వాడకపోవడం రైతులకు ఖర్చు తగ్గిపోతుంది.
- వ్యాపార సరళిలో వర్మీ కంపోస్ట్ తయారు చేయడం ద్వారా రైతులు స్వయం ఉపాధిని కూడా పొందవచ్చు.

సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు

సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సీపీ శ్వేత తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించవచ్చని ఆశ చూపించి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. వ్యక్తిగత సమాచారం సామాజిక మాధ్యమాల్లో పంచుకోకూడదని, ఫోన్లు వినియోగించేటపుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆదివారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన సైబర్ నేరాల వివరాలు తెలిపారు.

- గజ్వేల్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తికి బిట్‌కాయిన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెట్టాలని అతడి వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. మెసేజ్‌ను నమ్మి ఆన్‌లైన్‌లో రూ.1,45,000 పంపాడు. తర్వాత ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో తాను మోసపోయానని గ్రహించాడు.
- చిన్నకోడూర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఇన్‌స్టాగామ్‌లో పార్ట్‌టైం జాబ్ ఉందనే మెసేజ్ చూసి, అందులో తన వివరాలు నమోదు చేసుకున్నాడు. వారు సూచించిన ఖాతాకు రూ.86,256 డబ్బులు పంపి మోసపోయాడు.
- సిద్దిపేట రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తికి మొబైల్ నెట్‌వర్క్ నుంచి మాట్లాడుతున్నామని అపరిచితుడు ఫోన్ చేసి మీకు ఆపర్ ఇస్తున్నాము రూ.6,135 చెల్లిస్తే రూ.50వేలు చెల్లిస్తామని చెప్పాడు. బాధితుడు రూ.6,135 డబ్బులు పంపి మోసపోయాడు. అదేవిదంగా మరో వ్యక్తి క్రిప్టో కరెన్సీ పేరుతో పలు దఫాలుగా ఆన్‌లైన్‌లో రూ.53,500 పంపి మోసపోయాడు.
- తొగుట పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌కు అపరిచితుడు ఓ లింకు పంపాడు. అందులో పెట్టుబడి పెడితే ఎక్కువ కమీషన్ వస్తుందని నమ్మించాడు. అది నమ్మిన బాధితుడు రూ.18,420 పంపాడు. తర్వాత ఫోన్ చేయగా స్పందన లేకపోవడంతో సైబర్ మోసం జరిగినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పరిహారం కోసం రైతు ఆందోళన



పురుగు మందుల డబ్బాతో నిరసన తెలుపుతున్న లక్ష్మణ్ కుటుంబం

తూప్రాన్: తన వ్యవసాయ భూమిలో అక్రమంగా రోడ్డు, కల్వర్టు నిర్మించి పరిహారం అందించలేదని ఓ రైతు తన కుటుంబం తో ఆందోళనకు దిగాడు. ఈ సంఘటన ఆదివారం పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని డబుల్ బెడ్రూం సమీపంలో సర్వే నంబరు 325లో ప్రభుత్వ భూమిలో కాయిత శంకరమ్మ పేరుమీదు కొంత భూమి ఉంది. అలాగే కుమారుడు లక్ష్మణ్ పేరు మీదు పట్టా భూమి ఉంది. ఇందులో రోడ్డు, కల్వర్టును గత కొన్నేళ్ల క్రితం నిర్మించారు. అప్పటి నుంచి పరిహారం కోసం కలెక్టర్, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

సదరు కాంట్రాక్టర్ తమ పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నాడని కన్నీరు పెట్టుకున్నారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి పరిహారం అందజేయాలని, లేని పక్షంలో ఆత్మహత్య చేసుకుంటామని రైతు లక్ష్మణ్ కుటుంబ సభ్యులు హెచ్చరించారు.

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి



మీనా (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): భర్త దాడిలో తీవ్రంగా గాయపడిన భార్య చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆదివారం పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి అల్లీపూర్ గ్రామానికి చెందిన మీనా(26)ను ఇదే మండలం కొత్తపేట గ్రామానికి చెందిన అశోక్ తో మూడేళ్ల క్రితం వివాహం చేశారు. అదనపు కట్నం కోసం భార్యను భర్త మూడు రోజుల క్రితం రాయితో తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. మీనా పుట్టింటివారు ఆమెను చికిత్స నిమిత్తం కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఆదివారం ఉదయం మృతిచెందింది. మృతిరాలికి ఏడు నెలల బాబు ఉన్నాడు. దాడి చేసిన రోజు అశోక్‌పై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

స్కూటీని బైక్ ఢీ కొట్టిన ఘటనలో..

పటాన్‌చెరు టౌన్: స్కూటీని బైక్ ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స అనంతరం ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన భానూర్ బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బీడీఎల్ ఉద్యోగి రామచంద్రయ్య(58), తన కొడుకు పిల్లలు నందకిషోర్, హర్షిణి బీడీఎల్ నుంచి భానూర్ గ్రామంలో ట్యూషన్ దగ్గర వదిలేందుకు స్కూటీపై ఫిబ్రవరి 28వ తేదీన వెళ్తున్నాడు. ఈ క్రమంలో పటాన్‌చెరు నుంచి శంకర్ పల్లి వస్తున్న ద్విచక్ర వాహనదారుడు అతివేగంగా వచ్చి స్కూటీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో రామచంద్రయ్య, నందకిషోర్ కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం వీరిని చందానగర్లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేయించి 4వ తేదీన ఇంటికి తీసుకొచ్చారు. ఆదివారం తెల్లవారుజామున రామచంద్రయ్య మృతి చెందాడు. మృతుడి కుమారుడు రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పాపన్నపేట్(మెదక్): విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందింది. ఈ సంఘటన శనివారం రాత్రి కొడుపాకలో జరిగింది. గ్రామానికి చెందిన మహ్మద్ బాబు గేదెలు మేత మేయడానికి ఏటి గడ్డకు వెళ్లాయి. అక్కడ తెగిపడ్డ విద్యుత్ వైరుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందింది. గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.



గేదె కళేబరం

ఆర్థిక సాయం



చేగుంట(తూప్రాన్): ఆర్థిక సాయం అందిస్తున్న బీజేపీ నాయకులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని చిట్కోజిపల్లి గ్రామంలో బాధిత కుటుంబీకులకు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు పంపించిన ఆర్థికసాయం నాయకుడు భిక్షపతి ఆదివారం అందించారు. గ్రామానికి చెందిన యాదగిరి ఇటీవల మృతి చెందగా, ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాధిత కుటుంబీకులకు రూ.5వేలను అందించినట్లు భిక్షపతి తెలిపాడు.

శివ్వంపేట(నర్సాపూర్): ఇబ్బందుల్లో ఉన్న బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా అన్నారు. ఆదివారం 8 కుటుంబాలకు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తికి చెందిన ఫొటో గ్రాఫర్ గడ్డం ఆంజనేయులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. రాష్ట్ర ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘం భరోసా పథకం ద్వారా బాధితుని కుటుంబానికి రూ.1,85,000 చెక్కు రూపంలో రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు అందజేశారు.

యువకుడి అదృశ్యం

సిద్దిపేటకమాన్: మెకానిక్ షాపులో పనిచేసే యువకుడు కనిపించకుండా పోయాడు. ఆదివారం సిద్దిపేట టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తొగుట మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన కార్తీక్(18) సిద్దిపేట పట్టణంలోని ఓ బైక్ సర్వీసింగ్ సెంటర్లో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే శనివారం ఇంటి నుంచి వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో బాత్రూమ్‌కి వెళ్తున్నట్లుగా తెలిపి బయటకు వెళ్లాడు. ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన షాప్ ఓనర్ యువకుడి తండ్రి శ్రీనివాస్‌కు ఫోన్ చేసి విషయం తెలిపాడు. కార్తీక్ స్నేహితులు, బంధువులు అతడి కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కార్తీక్ తండ్రి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కార్పొరేట్ మతోన్మాద విధానాలు విరమించుకోవాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి కళావతి

కొండపాక(గజ్వేల్): కార్పొరేట్ మతోన్మాద అనుకూల విధానాలను కేంద్రం విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి కళావతి డిమాండ్ చేశారు. ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీలో నిర్వహించే సంఘర్ష ర్యాలీ సన్నహాక సమావేశం ఆదివారం మండలలోని దుద్దెడ శివారులో వ్యవసాయ కార్మిక, రైతు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కేంద్రం అవలంభిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తక్షణమే విరమించుకోవాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, గ్రామీణ ఉపాధి హామీ పనిదినాలను 200 రోజులకు పెంచాలన్నారు. రోజుకు కనీస వేతనం రూ.600 పెంచాలన్నారు. రైతులు పండించే ఉత్పత్తులకు మద్దతు ధరలు కల్పిస్తూ కొనుగోలు చేయాలన్నారు. వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేలా తెచ్చిన మూడు చట్టాలను రద్దు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించి సంవత్సరం అవుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రపంచ దేశాల ముందు భారత దేశ ప్రతిష్ఠలు దెబ్బతినేలా బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఆరోపించారు. సంఘర్ష ర్యాలీ జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో కార్మిక సంఘం జిల్లా నాయకులు కొమురవెల్లి కనకయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి అమ్ముల బాల్‌నర్సయ్య పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



శుభం కుమార్(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకొన్నాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన శుభం కుమార్(26) బతుకు దెరువు కోసం భార్యతో కలసి ఏడాది క్రితం అమీన్‌పూర్ పరిధిలోని బీఎస్ఆర్ కాలనీకి వచ్చాడు. ఐసీఐసీఐలో ఫోన్ బ్యాంకింగ్ లో పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం భార్య భవనంపైకి వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న శుభం కుమార్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడి బంధువు గణేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పట్టణ శివారులో జోరుగా పేకాట



నర్సాపూర్ శివారులో పేకాట ఆడుతున్న యువకులు

నర్సాపూర్: నర్సాపూర్ పట్టణ శివారులో జోరుగా పేకాట ఆడుతున్నారు. నర్సాపూర్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన పేకాటరాయుళ్లు అక్కడికి వచ్చి పేకాట ఆడుతున్నారని తెలిసింది. గతంలో పట్టణ శివారులో మల్పర్తి శివారులో కోడిపందాలు, పేకాట నిర్వహించేవారు. పేకాట ఆడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈవిషయంపై ఎస్ఐ శివకుమార్‌ను వివరణ కోరగా పట్టణ శివారులో పేకాట ఆడుతున్న విషయం తమ దృష్టికి రాలేదన్నారు. పేకాట ఆడటం నేరమని, పేకాట స్థావరాలు నిర్వహించేవారు, ఆడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృత్యువాత



వృద్ధుడి మృతదేహం

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒకరు, ట్రాక్టర్ ఢీకొనడంతో మరొకరు దుర్మరణం చెందారు.

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణ సమీప బీదర్ చౌరస్తా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్దుడు మృతి చెందాడు. ఆదివారం జహీరాబాద్ టౌన్ ఎస్ఐ శ్రీకాంత్ వివరాలు తెలిపారు. బీదర్ చౌరస్తాలోని 65వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వృద్ధుడు (60) మృతి చెందాడు. బలమైన గాయాలు కావడంతో జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



దుర్గయ్య మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్): ట్రాక్టర్ ఢీకొని టీవీఎస్‌పై వస్తున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన చిన్న శంకరంపేట మండలం శాలిపేట గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నశంకరంపేట మండలం ఎస్.కొండాపూర్ గ్రామస్తుడు గడ్డమీది దుర్గయ్య(57) ఖాజాపూర్‌లోని బంధువుల ఇంటిలో జరిగిన శుభ కార్యానికి హాజరై తిరిగి స్వగ్రామానికి టీవీఎస్‌పై వస్తున్నాడు. శాలిపేట గ్రామశివారులో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..



గౌస్ మృతదేహం

రాయికోడ్(అందోల్): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని సంగాపూర్ శివారులో చోటుచేసుకుంది. ఆదివారం ఎస్ఐ ఏడుకొండలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని బేగంపేట పోలీస్ లైన్‌కు చెందిన గౌస్(40) హైదరాబాద్‌కు చెందిన షరీఫ్ వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. షరీఫ్‌కు రాయికోడ్ మండలం కర్చల్ గ్రామంలో ఫాంహౌస్ ఉంది. శుక్రవారం షరీఫ్‌తో కలిసి గౌస్ కర్చల్ గ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో గౌస్ ఝరాసంగం మండలం జీర్లపల్లిలో విక్రయానికి ఉన్న ఓ భూమి చూసేందుకు శనివారం వెళ్లాడు. అక్కడ పరిచయమున్న కొందరితో కలిసి మద్యం తాగాడు. అధికంగా మద్యం తాగి రాత్రికి కర్చల్ గ్రామానికి బైక్‌పై తిరిగి వెళ్తున్న క్రమంలో అదుపు తప్పి మార్గం మధ్యలో పడిపోయాడు. అటుగా వెళుతున్న సింగితం గ్రామానికి చెందిన వారు గమనించి గౌస్‌ను బైక్‌పై ఎక్కించుకుని సింగితం వస్తున్నారు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న గౌస్ తానురానని సంగాపూర్ శివారులో దిగిపోయాడు. ఆదివారం వేకువజామున అటుగా వెళుతున్న వారు అచేతనంగా పడిఉన్న గౌస్‌ను చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పరిశీలించగా గౌస్ మృతి చెందాడు. మృతదేహానికి జహీరాబాద్‌లో పోస్టుమార్టం చేసి కుటుంబీకులకు అప్పగించారు. ఎక్కువ మోతాదులో మద్యం తాగడంతో గౌస్ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య ఆసియా బేగం ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ..



అంజుబాయి మృతదేహం

జహీరాబాద్ టౌన్: విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మొగుడంపల్లి మండలంలోని విట్టునాయక్ తండాకు చెందిన సికిందర్ రాథోడ్‌కు పొలం ఉంది. భర్త ఊరు వెళ్లడంతో భార్య అంజు బాయి చెరకు పంటకు నీరు పెట్టేందుకు వెళ్లింది. బోరు మోటారు వైరు పక్కకు జరుపుతుండగా విద్యుదాఘాతంతో అక్కడిక్కడే మృతి చెందింది. చుట్టుపక్కల రైతులు వచ్చి ఆమెను రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. ఈ మేరకు చిరాగ్‌పల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల అగ్నిప్రమాదాలు



పాపన్నపేటలో కాలిపోయిన ఇల్లు

వేర్వేరు చోట్ల జరిగిన అగ్నిప్రమాదాల్లో బాధితులు నిరాశ్రయులయ్యారు. అగ్నిప్రమాదాల్లో ఆస్తి నష్టం సంభవించడంతో తమను ఆదుకోవాలని కోరారు.

పాపన్నపేట(మెదక్): కొత్తింటి ఆశ సిలిండర్ పేలిన మంటల్లో బుగ్గి అయ్యింది. అర్ధరాత్రి పేలడంతో ఓ కుటుంబం వీధిన పడింది. అదృష్టవశాత్తు ఎవ్వరికి ప్రమాదం చోటు చేసుకోలేదు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని రామాపురంలో శనివారం అర్ధరాత్రి ముచ్చ కిష్టయ్య తన భార్య, కొడుకు, కూతురుతో కలిసి పూరింట్లో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి గ్యాస్ సిలిండర్ పేలి మంటలు వ్యాపించాయి. పేలుడు శబ్దానికి మెలకువ వచ్చిన కిష్టయ్య, తన భార్యాపిల్లలను తీసుకుని బయటకు పరుగులు తీశారు. అయితే కొత్త ఇంటి నిర్మాణం కోసం అప్పు చేసి తెచ్చిన రూ 2.35 లక్షలు, రెండు తులాల బంగారం, 2.5 తులాల వెండి అగ్నికి ఆహుతయ్యాయి.

సిద్దిపేటకమాన్: షార్ట్ సర్క్యూట్‌తో ఓ రెస్టారెంట్ దగ్ధమైన సంఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణానికి చెందిన సృజన్ కుమార్ పట్టణంలోని కొమటిచెరువు సమీపంలోని ఓ పెట్రోల్ పంపు పక్కన ఫుడ్ సిటీ రెస్టారెంట్ నడుపుతున్నాడు. రోజు మాదిరిగానే శనివారం రాత్రి రెస్టారెంట్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి రెస్టారెంట్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలకు ఆర్పేశారు. పోలీసులు కూడా ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడికి సమాచారం ఇచ్చారు. రెస్టారెంట్‌లో రూ.8 లక్షల విలువైన మూడు కూల్‌డ్రింక్ ఫ్రిడ్జ్‌లు, మూడు ఐస్ క్రీమ్ ఫ్రిడ్జ్‌లు, టీవీ, ఫర్నీచర్, ఇతర వస్తువులు కాలిపోయినట్లు తెలిపాడు. ఘటనపై బాధితుడు సిద్దిపేట వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దుబ్బాక: గ్యాస్ సిలిండర్ లీకవడంతో మంటలు చెలరేగి పూరిగుడిసె దగ్ధమైంది. ఈ సంఘటన ఆదివారం దుబ్బాకలో చోటు చేసుకుంది. సకాలంలో బాధితులు మంటలను ఆర్పివేశారు. దుబ్బాక నుంచి మల్లాయిపల్లి వెళ్లే రోడ్డు సమీపంలో కనేటి శ్రీనివాస్, శైలజ దంపతులు పూరిగుడిసెలో నివసిస్తున్నారు. గ్యాస్ సిలిండర్ లీకవడంతో అగ్ని ప్రమాదం సంభవించింది.